సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం : 21 : మే : 2024



భక్తుల పాలిట కల్పవల్లి.. నల్లగంగమ్మ తల్లి !

సంబేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగ్మ తల్లి దేవస్థానంలో ఈనెల 23న తిరునాల నిర్వహించనున్నారు. - 8లో



కల్యాణం... కమనీయం

రాజుపాలెం మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల వారి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.160	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 516 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 31.980 కిలోలు

న్యూస్‌రీల్

31లోపు అడ్మిషన్ ఫీజు చెల్లించాలి

రాజంపేట టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు అడ్మిషన్ ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ ఎస్వీ.రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్న కారణంగా ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఉదయం వేళల్లో పరీక్షలు ఉంటాయని అందువల్ల అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు వచ్చినా కళాశాలలోకి అనుమతించరని, ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని కోరారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

జిల్లా నోడల్ అధికారిగా దిశా డీఎస్పీ

రాయచోటి : జంతువుల అక్రమ రవాణా నిరోధానికి అన్నమయ్య జిల్లా నోడల్ అధికారిగా దిశా డీఎస్పీ బాపూజీని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించింది. సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి నోడల్ అధికారి నియామక ఉత్తర్వులు అందాయి. బాపూజీ ఆధ్వర్యంలో జంతువుల అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే చర్యలను చేపడతారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

24న డీఈఈ సెట్

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్‌జిల్లాలో మే 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు–2024(డీఈఈ సెట్) (కంప్యూటర్ బేస్డ్ పరీక్ష) పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ పరీక్షను కడపలోని కందుల ఓబుల్‌రెడ్డి మెమోరియల్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్, శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అభ్యర్థులు వారి హాల్‌టికెట్లు https://apdeecet.apcfss.inలో పొందొచ్చని తెలిపారు. హల్ టికెట్‌లో ఫొటో ప్రింట్ సరిగా లేకపోతే అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డు(ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్ గుర్తింపుకార్డు) పరీక్ష కేంద్రానికి తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె : వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి ఉర్దూ, ఇంగ్లీషు మీడియంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రవి పేర్కొన్నారు.ఈ ఏడాది 10వ తరగతి పాసైన వారు ఉర్దూ, ఇంగ్లీషు మీడియంతో పాటు సెకండ్ లాంగ్వేజ్ ఉర్దూ, తెలుగు తీసుకోవచ్చని ఆయన తెలిపారు.ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 90శాతం ఉత్తీర్ణం సాధించామని తెలిపారు.మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

22 నుంచి కౌన్సెలింగ్

కడప రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 22, 23వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ ఎల్ మాధవిలత తెలిపారు. 22న జిల్లా పరిధిలో ప్రవేశ పరీక్ష రాసిన బాలురకు గండి క్షేత్రం గురుకుల పాఠశాలలో, బాలికలకు 23వ తేదీన కడప చిన్నచౌక్ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామన్నారు. బాలుర గురుకులంలో 284 ఖాళీలు, బాలికల గురుకులంలో 441 ఖాళీల భర్తీకి 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని చెప్పారు.

27 నుంచి ఫొటో, వీడియోగ్రఫీలో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి ఫోటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు కొనసాగే ఈ శిక్షణకు అభ్యర్థులు 10–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు : వైఎస్సార్ జిల్లా పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని దర్శించుకున్న భక్తులు హుండీల ద్వారా సమర్పించుకున్న కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఇందులో మొత్తం రూ 3 27,410 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు.

ఎవరి లెక్కలు వారివి

ఓటింగ్ శాతం పెరుగుదల ప్రభుత్వంపై వ్యతిరేకత కాదు



కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈనెల 13న ముగిసింది. జూన్ 4వ తేదీ కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇంకా 14 రోజుల సమయం ఉంది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి ఫలితాలపై జిల్లాలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏ ఇద్దరు వ్యక్తులు కలుసుకున్నా ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్న విషయంపైనే చర్చించుకుంటున్నారు. టీవీ, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఇవే చర్చలు హోరెత్తుతున్నాయి. ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలవబోతోందంటూ విశ్లేషణలు చేస్తున్నారు. ఓటింగ్ శాతం పెరగడం చుట్టూ ప్రధానంగా చర్చ సాగుతోంది. ఓటింగ్‌శాతం పెరగడం ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న సానుకూలతకు నిదర్శనమని కొందరు, ప్రభుత్వ వ్యతిరేకతకు దర్పణమని మరికొందరు వాదోపవాదాలు చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఓటర్స్ టర్నవుట్ 79.77 శాతం కాగా, ఈ ఎన్నికల్లో 81.86 శాతానికి పెరిగిందంటే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే కారణమంటూ విపక్షాలు లెక్కలు కడుతున్నాయి. 2019 ఏప్రిల్ 11వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాత్రి బాగా పొద్దుపోయే వరకు ప్రజలు క్యూలో నిలుచుని ఓట్లు వేశారంటే తమ ప్రభుత్వంపై ఉన్న సానుకూలతకు నిదర్శనమని ఆనాడు మాట్లాడిన టీడీపీ నేతలు నేడు ఓటింగ్ శాతం పెరగడం ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు నిదర్శనమని నాలుక మడతేసి మాట్లాడుతున్నారు. ఓటర్స్ టర్నవుట్ పెరిగితే అధికార పార్టీ ఓటమి పాలవుతుందన్న సూత్రీకరణల్లో నిజం లేదని పలు ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. భారత దేశంలో 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్స్ టర్నవుట్ 66.44 శాతంగా నమోదైంది. ఎన్‌డీఏ 282 పార్లమెంట్ స్థానాలు పొందింది. 2019లో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో ఓటర్స్ టర్నవుట్ 67.40 శాతానికి పెరిగింది. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీయే ప్రభుత్వం ఓటమి పాలు కాలేదు సరికదా 303 పార్లమెంటు స్థానాలను కై వసం చేసుకుని తిరిగి అధికారంలోకి వచ్చింది.

రాష్ట్రంలో 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటర్స్ టర్నవుట్ 69.96 శాతంగా నమోదై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ 38.6 శాతం ఓట్లతో 185 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోగా, 37.6 శాతం ఓట్లతో టీడీపీ 47 స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఓటర్స్ టర్నవుట్ 72.72 శాతానికి పెరిగింది. టీడీపీ నేతల లెక్కల ప్రకారం ఆనాటి కాంగ్రెస్ ఓడిపోవాలి. కానీ అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 36.55 శాతం ఓట్లతో 156 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోగా 36.31 శాతం ఓట్లతో టీడీపీ 92 స్థానాలు దక్కించుకుంది.

అభివృద్ధి, సంక్షేమాలే కారణం

2004లో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారు. గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలుగొండ, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల మొత్తం పెంపు, 108, 104 తదితర సంక్షేమపథకాలు అమలు చేశారు. దీంతో ప్రజలు మళ్లీ ఆయనకే 2009లో పట్టం కట్టిన విషయం తెలిసిందే. 2019లో జరిగిన శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో 49.95 శాతం ఓట్లతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 151 స్థానాలు కై వసం చేసుకోగా, టీడీపీ 39.17 శాతం ఓట్లతో కేవలం 23 స్థానాలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చారు. పెన్షన్ల మొత్తాన్ని రూ. 2000–3000లకు పెంచారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, సున్నా వడ్డీ, పంట రుణాలు, మన బడి నాడు–నేడు, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, జగనన్న కాలనీలు ఇలా ఎన్నో పథకాలను అమలు చేశారు. విపక్ష కూటమి అధికారంలోకి వస్తే ఈ పథకాలకు మంగళం పాడుతారన్న భయంతో ఎర్రటి ఎండలను సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పోటెత్తి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ గెలుచుకున్న ఎమ్మెల్యే స్థానాల వివరాలు

నియోజకవర్గం	2004లో పోలింగ్ శాతం	గెలుపొందిన పార్టీ	2009లో పోలింగ్ శాతం	గెలుపొందిన పార్టీ
బద్వేలు	71.6	కాంగ్రెస్	73.1	కాంగ్రెస్
రాజంపేట	70.0	కాంగ్రెస్	74.6	కాంగ్రెస్
రైల్వేకోడూరు	71.8	కాంగ్రెస్	74.4	కాంగ్రెస్
రాయచోటి	67.3	టీడీపీ	76.8	కాంగ్రెస్
లక్కిరెడ్డిపల్లె	72.5	కాంగ్రెస్	--	--
కడప	59.3	కాంగ్రెస్	60.0	కాంగ్రెస్
కమలాపురం	74.2	టీడీపీ	84.4	కాంగ్రెస్
పులివెందుల	76.0	కాంగ్రెస్	78.7	కాంగ్రెస్
ప్రొద్దుటూరు	69.6	కాంగ్రెస్	77.0	టీడీపీ
జమ్మలమడుగు	80.1	కాంగ్రెస్	84.4	కాంగ్రెస్
మైదుకూరు	74.9	కాంగ్రెస్	80.0	కాంగ్రెస్

దేవుడా.. నీవే దిక్కు !

ప్రార్థన స్థలాల చుట్టూ అభ్యర్థులు



కడప కల్చరల్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ప్రధానమైన పోలింగ్ ఘట్టం ముగిసింది. ఓటర్లు కొన్నిచోట్ల అర్ధరాత్రి దాటాక కూడా ఓట్లు వేసేందుకు ఓపికగా ఉండడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇక తమను ఒడ్డున పడేసే శక్తి ఆ దేవుడికే ఉందని నమ్ముతూ అభ్యర్థులు చివరి ఆశగా దేవుడా...నీవే దిక్కు అంటూ ప్రార్థనాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మతాతీతంగా అన్ని మతాల దేవుళ్లకు మొక్కుకుంటున్నారు. తమను గెలిపిస్తే హుండీలు కానుకలు సమర్పించుకుంటామని దేవుళ్లకు నమ్మకంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తమ గెలుపుపై నమ్మకం సడలిన అభ్యర్థులు తొక్కని గడప లేదు...మొక్కని దేవుడు లేదు అన్నట్లుగా దేవుడిపైనే భారం వేసి ఈ మొక్కులే తమను గెలిపించాలంటూ కోరుకుంటున్నారు. మరికొందరు నాయకులు బృందాలుగా కలిసి పలు ప్రముఖ పుణ్యక్షేత్రాల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. ప్రముఖ దేవుళ్లకు మొక్కితే మంచి ఫలితాలు ఉంటాయని ఆశిస్తూ ఖర్చును లెక్కచేయక తీర్థ యాత్రల బాట పట్టారు.

జాతకం ఎలా ఉంది

ఈ ఎన్నికల్లో తమ జాతకం ఎలా ఉందో తెలుసుకునేందుకు కొందరు నాయకులు జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. ఉగాది నాడు పంచాంగకర్తలు ప్రజల మద్దతు లేని వారు గెలిచే అవకాశం లేదని స్పష్టం చేసినా ఏదో మూల కొండంత ఆశతో అంతో ఇంతో ఖర్చు పెట్టుకుని ఫలితం తమవైపు రావాలని, జాతకంలోని దోషాలను సవరించుకునేందుకు పండితులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వీరి జాతకాలు ఎలా ఉంటాయో, అవసరార్థ ప్రార్థనలు ఏ మేరకు ఫలిస్తాయో జూన్ 4వ తేదిన జరిగే కౌంటింగ్ తర్వాత వెల్లడి కానుంది.

మాట నిలబెట్టుకునే నాయకుడు సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు వైఎస్ జగనేనని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు రూ. 10 వేల కోట్లదాకా అందితే సీఎం జగన్‌పై ప్రజల్లో మరింత ప్రజాదరణ పెరిగి ఓట్లు వేస్తారన్న అక్కసుతో కొంతమంది కుట్రదారులు పన్నాగం పన్నారన్నారు. ముందే జమ కావాల్సిన డబ్బులపై కోర్టులకు వెళ్లడం, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి నిలుపుదల చేశారన్నారు. ఇందుకు స్పందించిన సీఎం జగన్ ముందు నుంచి ఇస్తున్న పథకాలను నిలుపుదల చేయవద్దని కోర్టు ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇప్పించారన్నారు. ఎన్నికల అనంతరం సుమారు రూ. 10 వేల కోట్లను ప్రజల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆసరా కింద పెండింగ్‌లో ఉన్న రూ. 1200 కోట్లను గతంలో రాని మహిళలందరికీ వారివారి సీసీల ద్వారా బ్యాంకుల్లో నాలుగైదు రోజుల్లో చేతికి తీసుకునే అవకాశం కల్గిందన్నారు. అలాగే ఈబీసీ నేస్తం కింద 45 నుంచి 60 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న అర్హత ఉన్న ఓసీ మహిళల ఖాతాలలో సోమవారం నుంచి జమ అవుతోందన్నారు. విద్యా దీవెన కింద నిధులు తల్లుల ఖాతాల్లో, ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం రైతులు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలో తుపాను కింద రూ. 50 కోట్లు, మొన్న కరువుకు నష్టపరిహారం కింద రూ. 11 కోట్లు పరిహారం ఈ ప్రభుత్వంలో అందిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు నాలుగో విడత చేయూత పథకానికి సంబంధించి రూ. 18750లు మంగళవారం నుంచి వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఎన్నికల సమయంలోనే కాదు ఎన్నికైన మరుసటిరోజు నుంచే ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. రైతులు, మహిళలు విద్యార్థుల తరపున సీఎం వైఎస్ జగన్‌కు శ్రీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్

జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్

రాయచోటి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే జూన్ 4న నిర్వహించే ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలన్నారు. కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు. అదే రోజు ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడింగ్, ఆర్‌ఓ టేబుల్, కౌంటింగ్ స్టాఫ్ టేబుల్స్, ఏజెంట్ల సీటింగ్, లైట్లు, ఫ్యాన్లు, కంప్యూటర్ సిస్టమ్స్ ఇంటర్నెట్ తదితర ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలన్నారు. అబ్జర్వర్ల లాంజ్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా బారికేడింగ్‌తో పాటు సీసీ కెమెరాలు ఉండాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో నిర్దేశిత ప్రాంతంలో మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల రౌండ్ వారి ఫలితాల ప్రకటనలను మీడియా కేంద్రానికి వెంటనే పంపాలని ఆర్‌ఓలకు సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ నిర్వహణపై అధికారులతో సమీక్ష చేస్తున్న ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రాయచోటి : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కృష్ణయ్యతో కలిసి డీఆర్‌ఓ సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివిధ డిపార్టుమెంట్ అధికారులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ ఏడాది వారికి మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకోసం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు ప్రకాష్, అమరేంద్ర కుమార్, నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష చేస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

స్కానింగ్ మిషన్ పరిశీలన

నందలూరు (రాజంపేట) : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరఫరా చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి దేవశిరోమణి పరిశీలించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతినెల 9,10వ తేదీల్లో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. లింగ నిర్ధారణ చేయకూడదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ డి కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్‌ఓ వెంకటనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, పీహెచ్ఎన్ శైలజ, సూపర్ వైజర్లు నాగమల్లయ్య, సునీల్, ఎంఎల్‌హెచ్‌పీ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ అధికారిణి దేవశిరోమణి

యంత్రంలో ఫలితాలు.. బెట్టింగ్‌ల జోరు

- ప్రతిపక్షాల్లో తగ్గుతున్న హుషారు
- పలుచోట్ల కట్టిన బెట్టింగ్ వాపసు

కడప కల్చరల్ : హిమాలయ పర్వతాన్నైనా ఢీకొంటాం..ఎంతటి ధీరుడినైనా లక్షల మెజార్టీతో ఓడిస్తాం ..రాష్ట్రమంతటా క్లీన్ స్వీప్ చేస్తాం..అంటూ నిన్నటి వరకు తొడలు కొట్టారు..జబ్బలు చరిచారు.. గెలిచేది మేమే అంటూ సహచరులతో బీరాలు పలికారు. ప్రస్తుతం వాతావరణంతోపాటు ఎన్నికల వాతావరణం చల్లబడింది. నిన్నటివరకు ఎన్నికల్లో హడావుడిగా తిరిగిన వారంతా ఇంటికే పరిమితమయ్యారు. మరికొందరు నాయకులు తీరిగ్గా తమ పార్టీ విజయంపై చర్చలు చేస్తూ బెట్టింగ్‌లకు దిగారు.

సంక్రాంతిలో కోడిపందేల సీజన్‌లాగా ఎన్నికల సీజన్‌లో బెట్టింగ్‌లు సాధారణమే. ఈసారి ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగాయి. అన్ని పార్టీలు గెలుపుకోసం సర్వశక్తులు ఒడ్డాయి. ఇందులో సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రజాభిమానాన్ని కొల్లగొట్టిన పార్టీలకే విజయావకాశాలు ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. పోలింగ్ అయ్యాక చిన్నా, చితకా నాయకుల నుంచి బడా నాయకుల వరకు మొబైల్ ఫోన్లలో యూ ట్యూబుల్లో వచ్చే రకరకాల సర్వేలు చూసుకుంటూ తమ పార్టీకి అనుకూలంగా ఉన్న ఫలితాలతో లేని ఉత్సాహం తెచ్చుకుంటున్నారు. ఇతర పార్టీలకు అనుకూలంగా ఉన్న సర్వేలను తిట్టి పోస్తున్నారు. మరికొందరు శాంతికామకులు తమకు మంచి ఫలితాలివ్వాలని దేవుళ్లను కోరుతూ గుళ్ల, గోపురాల చుట్టూ తిరుగుతున్నారు. జూన్ 4వ తేదీ వరకు ఆగండ్రా..ఎందుకు తొందర పడతారు...అని అనుభవజ్ఞులు వారిస్తున్నా వినిపించుకోవడంలేదు.

భారీగా బెట్టింగులు

ఎన్నికల ఫలితాలు యంత్రంలో గుట్టుగా ఉండగా, నాయకులు మాత్రం తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంతో తమ పార్టీయే గెలుస్తుందని, పందెం కట్టే దమ్ముంటే రావాలంటూ సవాళ్లు విసురుతున్నారు. గంటకో రకం సర్వేలు వస్తుండగా, వాటిని నమ్మి కొందరు లక్షల రూపాయల్లో బెట్టింగ్ కాస్తున్నారు. ముందెన్నడూ లేని విధంగా ఈసారి బెట్టింగ్‌ల హడావుడి బాగా పెరిగింది.ప్రస్తుతం బెట్టింగ్‌లు, చాలెంజ్‌లు కంప్యూటర్ల స్థాయికి చేరాయి. పందేలు, ఇచ్చిపుచ్చుకోవడాలు అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. పలువురు నాయకులు తమకు అనుకూలంగా ఉన్న సర్వేల సంఖ్య చూసుకుని తామే గెలుస్తామంటూ లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మరికొందరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని కూడా బెట్టింగ్‌లకు వాడుతున్నారు. ఇంకొందరు ఏజెన్సీల ద్వారా బెట్టింగులకు పాల్పడుతున్నారు. పలుచోట్ల కట్టిన బెట్టింగ్‌లను వాపసు తీసుకుంటున్నారు.



ముందుజాగ్రత్త

అంతగా పేరు లేని ఓ నాయకుడికి అనుకోకుండా మొన్నటివరకు ఓ వెలుగు వెలిగి మూలనపడ్డ ఓ జాతీయ పార్టీ నుంచి ఆఫర్ వచ్చింది. ఎమ్మెల్యేగా పోటీకి దిగారు. తన విజయంపై ఏమాత్రం ఆశ లేని ఆయన పార్టీ ఇచ్చిన ఫండ్‌ను సగానికి మాత్రమే పంపిణీ చేసి మిగతాది జేబులో వేసుకున్నాడు. మిగతా సొమ్మును గెలిచే అవకాశం గల పార్టీపై ఏజెన్సీ ద్వారా బెట్టింగ్ పెట్టాడు. ఆ పార్టీ ఎటూ గెలుస్తుందని తన సొమ్ముకు డబుల్‌అమౌంట్ వస్తుందని ఆయనకు పూర్తి నమ్మకం. పంపిణీలో అంతో ఇంతో మిగుల్చుకున్న చోటా మోటా నాయకులు కూడా బెట్టింగ్ రాయుళ్ల, ఏజెన్సీల మాయలో పడి పందేలకు పాల్పడుతున్నారు.

యూ టర్న్

ఆ పార్టీ ఓడిపోతుందని ఓ పెద్ద పార్టీపై ప్రతిపక్షాలన్నీ కట్టగట్టుకుని ప్రచారం సాగించాయి. ఫలితంగా ఆ పార్టీకి అనుకూలంగా పందెం కాసేవారే కరువయ్యారు. పోలింగ్ గడిచిన రెండు రోజుల తర్వాత నుంచి ఆ పార్టీ విజయవకాశాలపై నమ్మకం కుదరడంతో ఆ పార్టీపై బెట్టింగ్‌లు పెరిగాయి. అంతవరకు కళకళలాడుతూ ఉండిన గ్రూపు పార్టీల బెట్టింగ్ కౌంటర్లు ప్రస్తుతం క్రమంగా వెలవెలబోతున్నాయి. ప్రజల్లో విశ్వాసం ఉన్న పార్టీ మాత్రమే విజయం సాధిస్తుంది. అంతవరకు వేచి చూడక తప్పదు. లేనిపోని దురాశతో బెట్టింగ్‌లకు పాల్పడితే నిరాశ తప్పదని పలువురు విజ్ఞులు హితవు చెబుతున్నారు. డబ్బు వెచ్చించి బీపీలు పెంచుకుని అనారోగ్యం పాలు కావడం ఎందుకని, బెట్టింగ్‌లకు పాల్పడకుండా ఉండాలని సూచిస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున మండలంలోని రాష్ట్ర సరిహద్దు చీకల బైలు చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు బస్సులో కర్ణాటకకు చెందిన బీర్ బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. కలికిరికి చెందిన పి.ప్రసాద్ (29), తిరుపతికి చెందిన కె. సురేంద్ర రెడ్డి(34), పీలేరుకు చెందిన పి.సాయి ప్రసాద్ (29), బస్సులో కర్ణాటక నుంచి వస్తూ.. 28 బీరు బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా, నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం విలువ రూ.3,675ఉంటుందని చెప్పారు. నిందితులు ముగ్గురిపై ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్డెన్‌సెర్చ్‌లో సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నె తాండాలో వన్‌టౌన్ పోలీసులు సోమవారం ఉదయం నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో సారా అమ్ముతున్న మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ వలీబాషు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ ప్రసాదరెడ్డి ఉత్తర్వులతో స్థానిక నక్కలదిన్నె తాండాలో సోమవారం ఉదయం కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిని జల్లెడపట్టి విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో బుక్కే రాములమ్మ(29) ఇంటి వద్ద సారా అమ్ముతూ పట్టుబడిందన్నారు. దీంతో ఆమెను అరెస్ట్ చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

భూ వివాదం

- ఇరువర్గాలపై కేసు నమోదు

గాలివీడు : మండల పరిధిలోని ప్యారంపల్లె గ్రామం కోటకాడపల్లెలో భూ వివాదంపై ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటప్రసాద్ వివరాల మేరకు వెంకటమ్మ కుమారులు చిన్నరెడ్డప్ప, పెద్దరెడ్డప్పల వద్ద నుంచి అదెపల్లెకు చెందిన తోట రామాంజులు, మల్లికార్జున, రాంబాబులు ప్యారంపల్లె గ్రామం పొలంలోని సర్వే నంబరు 808/4లో య 1-00 భూమిని కొనుగోలు చేశారు. అదెపల్లెకు చెందిన బత్తుల రమణయ్య ఊరు నాది మీరు ఎవరు కొనుగోలు చేసేదని సోమవారం భూమి వద్ద ఘర్షణకు దిగారు. రమణయ్య కుడి చేతిపై తోట సోదరులు కొడవలితో దాడి చేశారు. బత్తల రమణయ్య దాడిలో తోట రాంబాబు చేతికి గాయం కావడంతో ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స నిమిత్తం ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భక్తుల పాలిట కల్పవల్లి.. నల్లగంగమ్మ తల్లి!

- సైన్స్‌కు అందని సత్యం శ్రీ దేవరరాయి మహత్యం
- 23న శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి తిరునాల


నల్లగంగమ్మతల్లి మూలవిరాట్


నల్లగంగమ్మతల్లి ఆలయం


మహత్యం గల పొల్లేరు రాయి


ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళి

సంబేపల్లె : సకల చైతన్య శక్తి స్వరూపిణి.. భువనైక పావని.. ఆశ్రిత జన పోషణి అన్నమయ్య జిల్లా, సంబేపల్లె మండలం, సంబేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగ్మ తల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతోంది. దుష్ట శిక్షణ శిష్టజన సంరక్షణ ధ్యేయంగా వివిధ కాలాలలో వివిధ రూపాలలో అవతారమెత్తిన ఆ జగజ్జనని మహిషాసురమర్దిని మన ముంగిట్లో నల్లగంగమ్మ తల్లి రూపంలో అవతరించి ఆయురారోగ్యాలలను, పాడిపంటలను, సంతాన సౌభాగ్యాలను, సిరిసంపదలను అనుగ్రహిస్తూ ఉందని భక్తుల విశ్వాసం. బీజాక్షరాలతో వెలసిన దేవరరాయి సైన్సుకు అందని సత్యంగా నిలుస్తోంది. పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి దేవస్థానంలో ఈనెల 23న అంగరంగ వైభవంగా తిరునాల నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ విస్తరణ, మహామండపం నిర్మాణ పనులు సుమారుగా పూర్తి కావడంతో ఈ ఏడాది తిరునాల నూతన శోభను సంతరించుకుంది.

కార్యక్రమాల వివరాలు..

ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, ఉదయం 8 గంటలకు హోమాలు, 11.30 గంటలకు భక్తి గీతాలాపన, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ఉంటాయి. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి పల్లకి సేవ, రాత్రి 7 గంటలకు చెక్క భజన, అన్నదానం, రాత్రి 7.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి చాందినీ బండ్ల మెరవణి తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళి తెలిపారు.

చురుగ్గా ఏర్పాట్లు..

తిరునాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. విద్యుత్ దీపాలంకరణతో ఆలయం కళకళలాడుతోంది. వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాట్లపై ఎస్ఐ రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

ముమ్మర ప్రచారం..

తిరునాలపై కరపత్రాలు, పోస్టర్ల ద్వారా రాయలసీమ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో జోరుగా ప్రచారం కల్పిస్తున్నారు.

ఆలయ చరిత్ర..

త్రేతాయుగంలో ఈ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేది. రైతులు పశువులను మేపుకునేవారు. అప్పట్లో కాలికి గాయమై కుంటుతూ నడుస్తున్న ఓ మేక ఓ రోజు ఈ ప్రాంతంలోని ముళ్లపొదల్ని దాటగానే మామూలు మేకలా నడిచింది. ఇది గమనించి ఆశ్చర్యపోయిన మేకల కాపరి ముళ్లపొదల్లో ఏదో మహత్యం ఉందన్న సంగతి గుర్తించి మిగతా పశువుల కాపర్లతో కలిసి ముళ్ల పొదల్లో వెతకగా ఓ బండరాయి కనిపించింది. ఆ రాయిపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉన్నాయి. దీనిని శక్తివంతమైనదిగా గ్రహించిన కాపరులు పూజలు చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో ఈ దారిన వెళ్తున్న ఓ మహాముని పూజలు అందుకుంటున్న బీజాక్షరాలతో వెలసిన ఈ రాయిని చూసి శక్తిదాయినిగా గుర్తించి ఎదురుగా నల్లగంగమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తూర్పున కదిరి దేవుని కొండ, పడమర దుర్గం, ఉత్తరాన వెదుర్లకొండ, దక్షిణాన ముగదాల కొండల మధ్యన వెలసిన నల్లగంగమ్మ తల్లికి ఓ చిన్న ఆలయం నిర్మితమైంది. కొన్నాళ్లపాటు ఈ గుడిలోనే పూజలందుకుంటూ వచ్చిన నల్లగంగమ్మతల్లి దేవర రాయి నల్లగంగమ్మతల్లిగా ప్రసిద్ధి చెందింది. ఈ క్రమంలో ఓ రోజున నల్లగంగమ్మతల్లి రాయచోటికి చెందిన వ్యాపారి మునగా మురళికి కలలో కనిపించి తన ఆలయాన్ని పునరుద్ధరించమని ఆజ్ఞాపించింది. అమ్మవారి ఆజ్ఞ ప్రకారం ఆయన తన శక్తి మేరకు ఆలయాన్ని అభివృద్ధి చేసి నిత్యం పూజలు జరిగేలా కృషి చేశారు. ఏడాది క్రితం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కృషితో రూ. 1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆలయ విస్తరణ, మహామండపం నిర్మాణ పనులు సుమారుగా పూర్తయ్యాయి. దీంతో ఆలయం సర్వాంగ సుందరంగా, అద్భుత శిల్ప కళా నైపుణ్యంతో రూపుదిద్దుకుంటోంది. ఎన్నో మహిమల్ని కనబరుస్తూ భక్తుల పాలిట వరప్రదాయినిగా వెలసిన శ్రీ నల్లగంగమ్మతల్లిని పొరుగు జిల్లాలు, రాష్ట్రాల భక్తులు సైత్యం నిత్యం దర్శించుకోవడం విశేషం.

పెళ్లి పత్రికలు పంచేందుకు వెళుతూ..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


మహబూబ్‌జాన్ (ఫైల్)


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ మహబూబ్‌జాన్

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ ఆదర్శ పాఠశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ మహబూబ్ జాన్(47) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడు షేక్ మహమ్మద్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని గువ్వలచెరువుకు చెందిన షేక్ మహబూబ్‌జాన్ ఆమె కుమారుడు మహమ్మద్ అలీతో కలిసి కుమార్తె వివాహ పత్రికలను పంచేందుకు ఏపీ04బీసీ2692 ద్విచక్ర వాహనంలో రాయచోటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఆదర్శ పాఠశాల సమీపంలో మండలానికి చెందిన సెల్ పాయింట్ నిర్వాహకుడు భాస్కర్ కారులో రాయచోటికి వెళుతూ వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహిళ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మహమ్మద్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. బైకును ఢీ కొని కారు ఆపకుండా వెళ్లిపోయాడు. వెంటనే సమాచారం తెలుసుకున్న పోలీసులు కారును వెంబడించి కారును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలి


బ్లాస్టింగ్ పనులు నిలిపివేయాలని స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

మదనపల్లె : ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అమ్మచెరువుమిట్ట వద్ద వెలుగు ప్రత్యేక పాఠశాల వెనుకవైపు జరుగుతున్న బ్లాస్టింగ్ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు జరుపుతున్న బ్లాస్టింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఆక్రమణదారులకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ...మండలంలోని కోళ్లబైలు రెవెన్యూ గ్రామంలో భూకబ్జాలు, అక్రమాలకు అంతే లేకుండా పోయిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల మధ్యలో అర్ధరాత్రి పూట సర్వే నంబర్.529లోని గుట్టలో బ్లాస్టింగ్ కారణంగా భూమి కంపించి చుట్టుపక్కల ఉన్న ఇళ్లు కదులుతున్నాయన్నారు. వెలుగు పాఠశాలలోని మానసిక వికలాంగులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు సహకరించడం వల్లే బ్లాస్టింగ్ జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ తక్షణమే స్పందించి బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమూర్తి, వైఎస్సార్ నగర్, బృందావన్‌కాలనీ, జగన్‌కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. రాజంపేటకు చెందిన శ్రీరాములు కుమారుడు కిరణ్ (26), కారులో బెంగళూరు వెళ్లి సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణంలో రాజంపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని చెరువు కట్ట వద్ద ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొనడంతో కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో కారులో ప్రయాణిస్తున్న మదనపల్లె మిషన్ కాంపౌండ్ సమీపంలో నివాసం ఉన్న మనశ్విత (18), ప్రియాంక(17) తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ అనిల్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కిరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మనశ్విత, ప్రియాంకలను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కురబలకోట పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మారెళ్లమడకలో దారుణం


యోగీశ్వరరెడ్డి, వాసుదేవరెడ్డి మామిడి తోటలో చెట్లు నరికిన దృశ్యం


దుండగుల చేతిలో నేలకొరిగిన పార్థసారథి రెడ్డికి చెందిన మామిడి తోట

- 106 మామిడి చెట్లు నరికివేత
- రూ.10 లక్షలకు పైగా నష్టం

చక్రాయపేట : మండలంలోని మారెళ్లమడకలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపునకు వచ్చిన మామిడి చెట్లను నరికి రైతులకు తీవ్ర నష్టం కలిగించారు. ఇంతటి దారుణమైన సంఘటన చక్రాయపేట మండల చరిత్రలో ఎన్నడూ జరగ లేదు. ఇందులో రాజకీయ పార్టీల ప్రమేయం లేదని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తుల పనేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బాధిత రైతులు బొజ్జా యోగీశ్వర రెడ్డి, వాసుదేవరెడ్డి, బొజ్జా పార్థ సారథిరెడ్డి(మాజీ సర్పంచ్), ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డిల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయాన్నే మామిడి చెట్లకు నీళ్లు పెట్టేందుకు రైతులు వెళ్లారు. తోటలోకి వెళ్లగానే చెట్లు నరికిన విషయం గుర్తించి వెంటనే గ్రామస్తులకు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తోటలోకి వెళ్లి చూడగా 6 సంవత్సరాల వయసు కలిగి కాపునకు వస్తున్న యోగీశ్వర రెడ్డి, వాసుదేవరెడ్డికి చెందిన 70 మామిడి చెట్ల కొమ్మలు అన్నింటిని నరికి మోడులుగా చేశారు. అలాగే పార్థసారథిరెడ్డికి చెందిన 36 మామిడి చెట్లు(3 సంవత్సరాల వయస్సు కలిగినవి) మొదలుకే నరికేశారు .దీంతో బాధిత రైతులు కన్నీటి పర్యంతం అయ్యారు. ఇరువురికి కలిసి సుమారు రూ.10 లక్షలకు పైగానే నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎన్నికలు కూడా గ్రామంలో ప్రశాంతంగా జరిగాయని ఊర్లో తమకు ఎలాంటి శత్రువులు లేరని బాధిత రైతులతో పాటు మారెళ్ల మడక వాసులు పేర్కొంటున్నారు. కాగా పార్థసారథిరెడ్డి వైఎస్ఆర్‌సీపీ వర్గీయుడు.

త్వరలోనే దుండగులను పట్టుకుంటాం: సీఐ గోవిందరెడ్డి

మారెళ్లమడకలో జరిగిన సంఘటన బాధాకరమైందని ఇందుకు కారణమైన దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు వెంటనే వెళ్లి పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను కూడా పిలిపించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హంస వాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు


హంస వాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు సోమవారం అగస్త్యేశ్వర స్వామి హంస వాహనంపై ఊరేగారు. తెల్లవారుజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మండప స్థితదేవతలకు పూజలు, దీక్షా నిత్యోపాసన హోమాలు, నిత్య బలిహరణ, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో 40 మంది చిన్నారులు చేసిన కూచిపూడి, శాస్త్రీయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాలయ ఈఓ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.శంకరబాలాజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, వేదపాఠశాల గురువు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

- వైభవంగా చెన్నకేశవుని కల్యాణం
- పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు


వెల్లాలలో శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల వారి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు ఉదయం విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సంజీవరాయ కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలకు నూతన పట్టువస్త్రాలతో, రంగరంగుల పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించారు. ఆలయ చైర్మన్ బి.జగదీశ్వరరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. అక్కడకు వచ్చిన భక్తులకు సంజీవరాయ అన్నదాన కమిటీ సభ్యులు అన్నసత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పర్లపాడు ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, గోపాయపల్లె సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్ రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాలలో సోమవారం రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల విగ్రహాలను పల్లకీపై వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ స్వాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ జగదీశ్వర రెడ్డి, ఈఓ నరసయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు పాల్గొన్నారు.

విలువైన వస్తువులు ప్రయాణికులకు అప్పగింత


విలువైన వస్తువులను బాధితుడికి అందజేస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైలులో పోగొట్టుకున్న వస్తువులను 139 సహాయంతో బాధిత ప్రయాణికులకు అందించిన ఘటన కడప రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హోస్పేటకు చెందిన నీరజ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి రేణిగుంటలో ఈనెల 18వ తేదీ రాత్రి హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోయారు. అయితే ఈయన ముందుగా వారివద్ద ఉన్న మూడు బ్యాగులను ఏ-1 కోచ్‌లో పెట్టి మిగతా కుటుంబ సభ్యులను రైలు ఎక్కించేందుకు కిందకు దిగారు. అంతలోనే రైలు కదిలింది. దీంతో చేసేదేమీ లేక 139కు ఫోన్ చేసి వివరాలు తెలిపారు. ఆ వివరాలు నమోదు చేసుకున్న రైల్వే కంట్రోల్ రూము అధికారులు వెంటనే కడప ఆర్‌పీఎఫ్ అధికారులకు సమాచారం అందించారు. ఈ రైలు కడపకు రాగానే ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుల్ రవికుమార్ రైలులోని ఏ-1 కోచ్‌లో ఉన్న బ్యాగులను స్వాధీనం చేసుకుని ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో భద్రపరిచారు. ఈ సమాచారాన్ని బాధితుడికి తెలియజేశారు. సోమవారం బాధితుడు తగిన ఆధారాలతో రావడంతో అతనికి బ్యాగులో ఉన్న రూ. 1.20 లక్షల నగదు, 11 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి ఆభరణాలు, బనారస్ చీరలు, ఇతర వస్తువులను అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు నీరజ్ కుమార్ మాట్లాడుతూ కడప ఆర్‌పీఎఫ్ అధికారులు సకాలంలో స్పందించి తమ సామగ్రి, అందులోని విలువైన బంగారు, వెండి ఆభరణాలను అందించారని, వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

లక్ష్యంతో పనిచేసినప్పుడే ప్రమాదాల నివారణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి డ్రైవరు లక్ష్యంతో పనిచేసినప్పుడే ప్రమాదాలను నివారించగలరని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కడప నగరంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆర్‌ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రైవర్లకు అత్యల్ప ఇంధన పొదుపు, ప్రమాద రహిత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధికి డ్రైవర్లు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. చిన్నపాటి మెలకువలు పాటించడం ద్వారా అధిక కేఎంపీఎల్ సాధించవచ్చన్నారు. ప్రతి డ్రైవర్ విధి నిర్వహణకు వచ్చే సమయంలో తమ కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం ట్రైనర్, సలహాదారు ఎస్ఎండీ హనీఫ్ ఇంధన పొదుపు, పంచసూత్రాలు పాటించడం, అధిక కేఎంపీఎల్‌పై డ్రైవర్లకు దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్, అన్నమయ్య చీఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ అధికారులు, రాయచోటి, బద్వేలు డిపో మేనేజర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.